పశువుల కొఠం

“మామా! వాకిలి తియ్యి; మామా! వాకిలి, వాకిలి!”

పెట్టకూత వినబడ్డ పుంజులాగ, చెవులు దొరెడు చేసుకొని అప్యాయంగా ఆలకించాడు ఆ పిఱుప- సాలలో గుర్రానికి మాలీసు చేస్తున్న రొబ్బయ్య; వడివడిగా పోయి వాకిలిచిలకు తీసి తలుపు తెరిచాడు, గడపలో నిలబడ్డ పెంచెల్ని ఆహ్వానం చేస్తూను.

“వాకిలి బిగించుకొన్నావేంవయ్యా, సంజకాడ? లోగా చిళ్ళాట లాడుతుండావా ఏంది?” అని కిసుక్కున నవ్వింది పెంచెలి.

“ఆడుతూనే వుండా” అన్నాడు బింకంగా రొబ్బయ్య.

“దేనితో?.... ....” అని తెల్లమొగం వేసింది పెంచెలి.

“నీతోనే................” అని సరాగంగా అన్నాడు రొబ్బడు.

“ఊఁ!.... ” అని దీర్ఘంతీస్తూ నెత్తిమీద గడ్డి గంప పట్టుకొని ఒక మెట్టెక్కింది పెంచెలి. గిల్లితే పాలుగారే దాని బుగ్గమీద చిటికెతో కొట్టి గడ్డిగంప తన రెండు చేతుల్లోకి తీసుకొన్నాడు రొబ్బడు.

వాకిట్లో రొబ్బడి దర్శనంతోనే శరీరం తేలిక అయిపోయిన పెంచెలికి నెత్తిమీది గంపకూడా తొలగేవరకు పిట్టలాగ ఎగిరి రొబ్బడితో కూడా గుర్రపు సాలలోకి దూకిం దది.

“మామా! గుర్రానికి గడ్డి మట్టసంవేసి తెస్తుండా నని, దినమ్మా నీ పోడు పడలేక, ఈ పొద్దు చేతులు బొబ్బలెక్కేటట్టు దోకి దోకి, తెచ్చాను చూడు! అరిచేతు లెట్లా పుళ్ళుపడ్డాయో?” అని రెండు చేతులూ రొబ్బడికి చూపించింది. తన రెండు చేతులతోనూ పెంచెలి పాణిగ్రహణం చేసి ఆమెను చూస్తున్నాడు రొబ్బడు.

“ఎండలు ముదిరినై మామా! పచ్చని గరికపోచ సిక్కడంలేదు. నేల తడి ఆరి గట్టిపడి రాయిలాగ పొద్దుగూకులూ ఎంత దోకినా-దోకుడుపార అరిగి మొద్దుబారడం, చేతులు పుళ్ళెక్కడం తప్ప- గంప మట్టానికికూడా

రావడంలేదు గడ్డి. ఇక తేకుంటే మామ కోపం చేస్తాడు గాబోసని మోసుకొని తెచ్చా" అని తల పైకెత్తి మామకళ్ళల్లోకి చూచింది పెంచెలి.

"కష్టం చేయకుంటే కడుపులోకి బువ్వ ఏడనుంచి వస్తుందను కొన్నావు?" అంటూ బొబ్బలెక్కిన పెంచెలి చేతులు తన కళ్ళల్లో పెట్టుకొని ఆమెను దగ్గరగా లాక్కొన్నాడు రొబ్బడు. పెంచెలి బాహావల్లరులు రొబ్బడి కంఠ సీమను చుట్టవేసుకొన్నవి. నుదుటిమీది నీటిచుక్కలు చేత్తో తుడిచి, ఆమెను సందిట్లోకి లాక్కొని ఫాలభాగం మీద తన పెదిమెలు మెదిపాడు రొబ్బడు. పెంచెలికి ఆ దినం చేసిన కాయకష్టం అంతా హరించి పోయి ఆనందం పొంగింది.

"వొద్దులు మామా! వొద్దులు: ఎవరన్నా సూస్తే సిగ్గుబోయేను" అని విడిపించుకోబోయింది పెంచెలి.

పైట జారగా రవికెలో బిర్రెక్కిన చిన్నిరొమ్ము ఒక్కసారిగా కంపించి చలించినట్లు తోచింది రొబ్బడి దృష్టికి, ఆ చలనంలోనే అతనికి హస్త చిత్త చాంచల్యాలు ఒక్కసారిగా అలుముకొన్నాయి.

"ఇహిహిహిహీ" అని గుర్రం సకిలించింది.

పరధ్యానంలో ఉలిక్కిపడి....

"అమ్మో! ఎవరో వస్తుండా"రని పట్టు విడిపించుకొని పైట సవరించుకొంది పెంచెలి.

"ఎంత పిరికిపిల్లవే" అంటూ గుర్రంవైపు మళ్ళి మాలీసు ఆరంభిం చాడు రొబ్బడు.

చీరకొంగున కట్టిన మూట విప్పి వక్క ముక్క పంటిసందున కటిక్కుమని కొరికి, సగంముక్క మూటలోనే వేసుకొని, ఆకుచుట్ట నోట్లో పెట్టుకొంటూ, గోడ కానుకొని కూర్చుంది పెంచెలి.

రొబ్బడు గుర్రానికి మాలీసు చేస్తున్నాడు; తొడలు దిగని లంగోటీ, కండలు తిరిగిన దేహం, విడుదైన వక్షస్థలం - పిక్కలమీది కండలు చెండుల్లాగ ఉటికేటట్టు, నేలకు కాళ్ల బిగదన్ని, గుర్రం డొక్కలికి తల మోటించి, ఊపిరి బిగబట్టి రెండు చేతులతోనూ తన శక్తికొద్దీ గుర్రానికి

మాలీసు చేస్తున్నాడు రొబ్బడు మోటురాళ్ళను పిడిగుద్దులచే ముక్కలు చేయగల బలం: లేవడాని పెంకకట్టిన యౌవనం: తన బలమేమో, ఎదురుగా నిలబడ్డ గుర్రం బలమేమో కూడా భేదం తెలుసుకోలేని నిర్లక్ష్యం- చేతులు మంటలె త్తేటట్లు గుర్రాన్ని రుద్దుతున్నాడు రొబ్బడు. గుర్రంకూడా పొట్ట కింద, మెడకింద, నడుములమీదా నొప్పులు తీసేటట్టు మర్దనా చేయించు కొంటూ, తన్నాస్థలంలోనుంచి అడుగుతీసి అడుగు పెట్టేటట్టు కదిలించు చూస్తా ఉంటూ, వెనక కాళ్ళు వెనక్కీ, ముందుకాళ్ళు ముందుకీ తన్నిపట్టి నిలబడే ఉంది, గుర్రమూ, రొబ్బడూ పంతాలు వేసుకొని కలియబడ్డారు. కాని ప్రపంచంలోగల జనం అంతా బ్రహ్మదేవుడు తన నాలుగు కాళ్ళలోనే పెట్టిన సంగ ఆ గుర్రం మరిచింది కాళ్ళు నేలకి తన్ని పట్టి తల గుర్రాని కానించి, "హుమ్మ"ని హుంకరిస్తూ మర్దించేవరకు, ఏనుగవంటి ఆ గుర్రం నడుము ఉండీలబడ్డలాగ జవజవలాడుతూ వంగి, వెనక కాళ్ళు కలగ దొక్కు కొని ఆ పక్కకి కింద పడబోయింది.

"ఆఁ భద్రం! మోటుతనం చేయవోక!" అని గోడ కానుకొన్న పెంచెలి రొబ్బణ్ణి హెచ్చరించింది.

కిచకిచలుపెట్టిన పిల్లలు నవ్వినట్లుగా "ఇహిహిహీ" అంటూ గుర్రం మళ్లా సకిలించింది.

రొబ్బడు ఎడంగా వచ్చి చేతులు దులుపుకొన్నాడు.

"ఏంటీ, ఒళ్ళంతా ఆ చెమటలు! అయ్యో! నీళ్ళలో మునిగి లేచినట్టుందావే! మరీ అంత మోటుతనమా? ఇట్టారా! ఒక్కోసారి తుడుస్తాను. రవ్వంత తాళి మళ్లా పట్టొచ్చులే!" అని మామను పిలిచింది పెంచెలి.

"ఉస్సు"మంటూ పెంచెలి కెదురుగ్గా మోకాళ్ళ మీద మోచేతులు పెట్టుకొని కూర్చొన్నాడు రొబ్బడు. చీరకొంగు తీసి అతని వక్షస్థలం, వీపూ, చేతులూ, ముఖం తుడిచింది పెంచెలి.

రొబ్బడికి అలుపు తీరింది. చెదిరిపోయిన అతని క్రాపింగులోని వెంట్రుకలు చేత్తో సవరిస్తోంది పెంచెలి.

"పిల్లా! బిడ్డల్నికనే ఈడు వచ్చీకూడా మనిద్దరికీ ఎన్నాళ్ళీ దొంగచేష్టలు?"

"అయితే నాకు పెళ్ళిచేయమని మా అయ్యనీ, అమ్మనీ నా నోటితో ఎట్లా అడగేనీ, నువ్వే చెప్పా?"

"ఏమి, అడిగితే ఎగ్గా?"

"ఎంత బాగుండా దీ యిద్దూరం! అంత ఉబలాటంగా ఉన్నవాడివైతే, నువ్వే వచ్చి మా అయ్య నడగ్గూడదూ?"

"మొగజన్మ ఎత్తి మూతిమీద మీసంగలవాడు, ఓ పరాయిమొగాణ్ణి పిల్ల నివ్వమని నాలిక తెగ్గోసినా అడగ్గలనా?"

"నీకెంత రోషం ఉంటాదో ఆడదాన్ని నాకూ అంతే ఉంటాది."

"అయితే పెళ్ళి చేసుకోకుండా ఈ మోయిన కూకుంటావా?"

"మొగోడివి నీకు లేని తొందర నా కేమొచ్చె?" అని రొబ్బడివెనక చేరి వీపుమీది మట్టినలుస్తూ కూర్చుంది పెంచెలి.

రవ్వంత నిదానించాడు రొబ్బడు.

"ఇంక గడువుపెట్టి క్రియలేదు. ఎప్పుడు నీ మెళ్లో బొట్టు కట్టేనా, గుర్రంమీద నిన్నెక్కించుకొని ఎప్పుడు ఉత్సవం చేసుకొనేనా, ఎప్పుడు నీ బుగ్గలు పులిమేనా - అని ఉబలాటంగానే ఉంటాది. మా సూపరెంటు దొరని కూడా అడిగాను. ఓ! అబ్బెంతరం లేకుండా తీసుకొని పొమ్మన్నాడు, గుర్రాన్ని. పిల్లా! పసుపుబట్టలు కట్టుకొని, ఈ చింతపువ్వు వన్నె గుర్రం మీద నిన్ను కూకోబెట్టుకొని, గాజుదీపా లేసుకొని, బొట్లు పేల్చుకొంటూ, ఉత్సవం చేసుకొంటే, నేను రాజులాగా ఉండనంటే!" అని మెడ వెనక్కి వెలేసి పెంచెలి ఒడిలోకి ఒరిగాడు రొబ్బడు.

"నువ్వు రాజులా గుంటే నేను మాత్రం రాణిలాగ ఉండనంటయ్యా?" అని అతని చెక్కిళ్ళమీద రెండు చిట్టి దెబ్బలు కొట్టింది పెంచెలి. "ఏవీ ఒక్క ముద్దియ్యవే పిల్లా!" అంటూ ఆమెముఖం తన ముఖంలోకి లాక్కొన్నాడు రొబ్బడు.

"నిజంగా మీదొర గుర్రాన్ని ఇస్తానన్నాడా మామా?" అని ఆత్రంతో అడిగింది పెంచెలి.

"నిజంగానే! నే నంటే మా దొరకి గుండెలో గుండెకాయ. అయిన వందలు కరుకులుపోసి మోజుపడి కొనుక్కొన్న జీవం. దాన్ని డబ్బిచ్చి ఆయన కొనుక్కోవడ మేందో, నా చేతిలో పెట్టడం ఏందో - అంతే! ఇంక దొరమళ్లా గుర్రంమాట మరిచిపోయేటట్లు చేశానుగాని ఏమరి ఉండా నను కొన్నావా? రేపవేళ అనకుండా, మాపవేళ అనకుండా బిడ్డని సాకినట్టు సాకుతుండాను గనకనే తల వెంటికి వాసికూడా తగ్గిపోకుండా ఏనుగలాగ ఎల్లా ఉండదో సూడు. వేడుకగా పెళ్ళి చేసుకొంటానంటే ఉత్సవానికి ఒక్క పూట గుర్రమే ఇవ్వననడానికి ఆయనికి నోరు వస్తదా మొదలు?"

"మామా! నాకు గుర్రంమీద కూకోవాలంటే భయమే!"

"నే నుండానుగా! వెనకతట్టు కూచోని పట్టుకోనూ?"

"అబ్బో' ఆ మాట తలసుకొంటూంటే ఒళ్లు జలదరిస్తోందయ్యా! మరి గుర్రం ఉండి ఉండి ఒక్కసారి పేరేం తీస్తేనో?"

"తీస్తదా ? మనం నిలుచోమంటే నిలుచోవాలె! కదంతొక్కమంటే తొక్కాలె! తరటు పొమ్మంటే పోవాలె! గాలప్ తీయమంటే తీయాలె! అంతేగాని దానిష్టప్రకారం పోడానికి గుండె ఉంటాయా?"

గుర్రం మళ్లా సకిలించింది.

"మామా! ఆ గుర్రమెక్కి మా వూరు వూరంతా వూరేగాలె. ఈ జన్మ ఇక ఈడేరినట్లే అవుతది నాకు."

"మీ వూరే అన్నమా ఉందే పిల్లా! ఈ నగరం అంతా తిప్పనంటే! గుర్రాన్ని లొంగగొట్టడంలో రొబ్బడంతటి సైసు ఉండాడా అనిపించుకొన్నా! ఓ! నీ సరదా తీరేటట్లు దేశం అంతా తిప్పుతా గుర్రం దిగకుండా."

"అట్టయితే నే నీరాత్రికే మా అమ్మదగ్గర అంటా నుండు పెళ్ళి సంగతి. మామా! నువ్వన్నట్లు మనకీ దొంగ చెల్లాటాలు బాగులేదే! ఏందీ కర్మ! మనిద్దరం ఇష్టపడ్డాక ఇంక నలుగు దేమొచ్చె !"

8)

రొబ్బడు సరేనని లేచి నిలబడి చెడ్డీ కంటుకొన్న మట్టి దులుపుకొన్నాడు.

తనకు కాబొయ్యే మగడూ, అతని ఎత్తునే నిలబడ్డ ఉన్నతమైన గుఱ్ఱమూ, రెండు పురుషసింహాల్లాగా గోచరించారు పెంచెలి కళ్ళకు. ఆ ఇద్దరినీ అట్టే చూచుకొని మనస్సులోనే పొంగిపోయింది పెంచెలి.

"సీకటి పడింది. పరుగుదూరం పోవాలె మామా! రేపు మళ్లా వస్తా..." నని గడ్డిగంప చంకన పెట్టుకొంది. జారిపోయిన కొప్పుముడి సవరించుకొంటూ, కట్టుకొన్న కుచ్చిళ్ళు చక్కజేసుకొంటూ, పైటకొంగు నడుంచుట్టూ తిప్పుకొంటూ జరజర, జరజర నడచిపోయింది పెంచెలి.

పోతూఉండే పెంచెల్ని అట్టే పరకాయించి చూచి చూచి, గడప దిగి వీధిలోకి పోంగనే,

"సేసుకొంటే ఇట్లాంటి పిల్లనే సేసుకోవలె; సుకపడాలె" నని అనుకొంటూ, గుఱ్ఱానికి దాణాపెట్టడానికి ఉలవలసంచి మూతి విప్పాడు రొబ్బడు.

2

పెంచెలి కాపురం ఉండే వూరు ఆ నగరానికి పరుగు దూరంలో వుంది. చీకటి దట్టం గాకముందే ఇల్లు చేరుకోవాలని పరుగులుతీస్తూ ఇంటి దారిపట్టి పోతోంది పెంచెలి. మంచి యౌవనంలో ఉన్న రొబ్బడూ, తనూ కలిసి కూచొని ఊరంతా ఊరేగగల చేయెత్తు గుఱ్ఱమూ, తన మాలవాడలో ఏ వధూవరులకీ లభ్యపడని అపూర్వమైన అశ్వారోహణ భాగ్యమూ—ఈ తలపులన్నీ పెంచెలి మనస్సును వికసింప జేయగా, శరీరం పులకరించి, ఆమె ఒకవిధమైన ఉత్సాహంతోనూ, ఉద్రేకంతోనూ తొందరగా పోతోంది.

తనవూరు ఇక అరమైలుదూరం ఉంది. కనిచీకటి పడుతూ పడుతూ ఉంది. డబడబమని ఆకాశంలో పెద్ద ఉరుము ఉరిమి, పెంచెలి హృదయాన్ని చెదరగొట్టింది. 'అమ్మో! ఎక్కడనో పిడుగు పడిందే' అని తటాలున వెనక్కి తిరిగి ఆకాశంలోకి చూచింది. సూర్యభగవానుడే లోకంలోకి జార

పోయాడో కాని నల్లని కాటుక కొండలు రెక్కలు కట్టుకొని ఆకాశంలోకి ఎగిరి పెంచెల్ని తరుముకొని వస్తున్నాయి. పెద్ద గాలీ వానా వచ్చి తాను తడిసిపోతానన్న భయంచేత పెంచెలి కాలివేగం వృద్ధిచేసింది. కాని అంతా కనురెప్పపాటు దృశ్యం. కళ్ళు చీకట్లు కమ్మే మెరుపులు మెరవడమేమిటో, మేఘాలు పరస్పరమూ ఒరుసుకొని గర్జించడమేమిటో, తూర్పు సముద్రం మీదుగా ఎగిరివచ్చే గాడ్పులు పశ్చిమగోళంవరకూ వ్యాపించడమేమిటో—అంతా అయిదు నిమిషాలలోనే. నల్లని ఆకాశం కరిగి నీరయిపోయింది వడగళ్ల రాళ్లవాన దౌష్ట్యానికి పెంచెలి ఓర్చుకోలేకపోయింది. వడగళ్ల తాకుడు—ఎవరో దుండగీండ్రు ఆమెను రాళ్లతో విసిరి కొట్టుతున్నట్లుగా వుంది. దొబ్బణ్ణి ఎంత స్మరించుకొన్నా తన నాయకోను రాలేకపోతున్నాడు. రాళ్ళదెబ్బలు తప్పించుకొనే ఉపాయం ఊహించుకొనే లోపలనే, ఆమె అపాదమస్తకమూ తడిసి ముద్దయిపోయింది. తలమీద వడగళ్ళ దెబ్బ తగలకుండా చంకనవున్న ఖాళీ గడ్డిగంప నెత్తిని బోర్లించుకొంది. అప్పటి కప్పుడే కారుమబ్బులు దశదిక్కులా ఆక్రమించుకొన్నవి. పొద్దెంత పోయిందో కాని, కటికి చీకటి కుంభవృష్టితోపాటు లోకాన్ని ముంచెత్తి వేస్తోంది. నెత్తి మీది గంప తన దృష్టికి కొంత అడ్డుగిలేవరకు, దారి వెతుక్కొంటూ అడుగులో అడుగు పెట్టుకొంటూపోయే పెంచెల్ని, ఒక పెనుగాలి చేతుల్లో ఎత్తుకొని, ఇరవై గజాల దూరంలో ఒక గానుగ చెట్టు మొదటిలోకి తీసుకొనిపోయి దింపింది.

నెత్తిమీది గంప పైకెత్తి పక్కగా చూచేసరికి, సమీపంలోనే వున్న దొక్క పశువులకొఠం. తల దాచుకోను రక్ష దొరికినందుకు సంతోషిస్తూ ఆ పశువుల పాకలోకి దుశుంగున దూరింది పెంచెలి: వానజల్లు తగలకుండా ఆ పాకలో ఒకమూల ఒదిగి, చలికి గడగడ వణికే దేహాన్ని కాపాడుకొంటోంది: బయట వానదేవుడూ, వాయుదేవుడూ పంతాలు వేసుకొని ప్రాణికోటులకు తగిలేదీ, తప్పేదీ తెలియక విచ్చలవిడిగా విహరిస్తున్నారు. తళుక్కుమని మెరుపులు మెరిసినప్పునల్లా ఆ కొఠంలో రెండు వరసలుగా కట్టివేసి, గాటిలో గడ్డి మేస్తూ ఉండిన ఆబోతులలాంటి పడమెద్దులా, వాటి తెల్లని మూపురాలూ, అందమైన కొమ్ములూ, గాంభీర్యమైన నేత్రాలూ—

అన్నీ ఒక్కసారిగా పెంచెలికళ్ళకు గోచరిస్తున్నాయి. ఆ ఆపత్సమయంలో ఆప్రదేశం అంతా నిర్జనప్రదేశంగా ఆమెకు పొడగట్టినప్పటికీ, రొబ్బడిలాగ, రొబ్బడి చేతుల్లో పెరిగే గుర్రం లాగ. బలిష్ఠమై దేహసౌష్ఠవంగల అన్ని వృషభరాజములు ఆమె దండనుండగా చూచుకొనేవరకు, తన ప్రాణానికేమీ భయంలేదని ఆ అబల కొకవిధమైన ధైర్యం కలిగింది. గాలీ, వానా రవంత తెరిపియిస్తే, ఎంతలో పోవాలి ఇంటికి!

తడిసిపోయిన గవికె శరీరాని కంటుకొనిపోయింది. నీళ్ల కారే పైట కొంగు తీసి పిండుకోవడానికి ఒకటి రెండు సార్లు ప్రయత్నించిందిగాని అన్ని ఎద్దుల సమక్షంలో పైట తొలగించుకోనిచ్చింది కాదు ఆమెశీలం.

గాటిలోని ఎండుగడ్డి విదిలించి, వామిలోనుంచి తెచ్చిన జొన్న చొప్ప కట్టల్ని పరిచి ఎద్దులముందు వేసుకొంటూ ఆ చివరనుండి ఈ చివరికి వస్తున్నాడు రాయుడి సేద్యగాడు ముతరాచు సుబ్బడు. ఆ పాకలో మనిషి సంచారం సవ్వడి తెలుసుకొనేవరకు కుదుటబడవలసిన పెంచెలి మనస్సు భీతిచెందింది - ఎందువల్ల ? ముతరాసు సుబ్బడిని వేటకుక్క ముక్కులా ఏమిటి? లేకుంటే ఆ గాఢాంధకారంలో పెంచెలి సవ్వడి అతడెట్లా పసికట్ట గలిగాడు!

"ఎవరామనిషి?" అని ప్రశ్నించాడు సుబ్బడు.

బదులు లేదు.

"ఎవరంటే మాట్లాడవేం?" అని సమీపించాడు సుబ్బడు.

"నేను చిన్నాయనా పెంచెల్ని."

"ఏ పెంచెలివే?"

"నేనయ్యా, వెంకటిగాడి కూతుర్నయ్యా! గడ్డి అమ్ముకొని వస్తుంటే వానకు తడిసి ఇట్టా వచ్చా" అన్నది పెంచెలి.

"ఎవర్రా ఆ మనిషి" అని పాక చివరినుండి ఆ చీకట్లో ఇంకో ప్రశ్న బయల్దేరింది.

జవాబు లేదు.

"ఒరే సుబ్బా! ఎవర్రా ఆ మనిషి?" అని మళ్ళా వచ్చింది ప్రశ్న.

జవాబు చెప్పకుండానే సుబ్బడు పెంచెల్ని విడిచి ఎద్దుల్లో జొరబడి ఆ చివరికి వెళ్ళిపోయాడు.

"ఎవరితోరా నువ్వు మాటాడుతుండేదీ!"

"అదే...."

"అదే అంటే?...."

"అదే నువ్వు కోరుకున్న మనిషే! వెంకటిగాడి కూతురు."

"పెంచెలే! ఈడ కెందు కొచ్చిందీ?"

"గడ్డి అమ్ముకొని ఇంటికి పోతుండదట! వాన వచ్చేవరకు పాకలోకి దూరింది."

"ఒరేయ్! సుబ్బా! ఇదేరా సమయం. చిక్కిందిలే! ఇక పోలేదులే.."

"............"

"నేను ఈడుండానని దానితో చెప్పకుండా చెయ్యి పట్టుకొని దాన్నిట్లా లాక్కురా!"

"తలా, ఒళ్లూ, గుడ్డా తడిసి ముద్దయిపోయిందే! అబ్బే! ఈ తడవ పోనీ, ఇంకోపాలి పిలుచుకొని వస్తాలే."

"అట్టా గాదురా, చెయ్యిజారితే మనకు చిక్కదురా- నీకు తెలియదు. దానికోసరం ఇప్పటికి ముగ్గురిచేత కబురు చేశాను. అది రానని చెప్పింది. ఈ సమయం పోగొట్టుకొని ఉపయోగం లేదు."

"................"

"నీ కెందుకు, నువ్వు పోయి దాన్నిట్లా లాక్కొని వద్దూ. తరువాత సంగతి నేను సరిపెట్టుకుంటాను."

ఫెళఫెళమని పెద్ద ఉరుము ఉరిమింది. పరధ్యానంలో ఉండిన పెంచెలి జడుసుకొని, మెరుపుతీగలాగే దానిశరీరం కంపించి వంకలు తీసింది. నోటిలోకి తీసుకొన్న గడ్డి నోటిలోనే పెట్టుకొని, నములడం చాలించి, మెడలెత్తి నిర్ఘాంతపోయి చూస్తున్నాయి ఆ వృషభరాజములు. గాలి వానా వాటి ఇష్టంవచ్చినట్లు చెలగాటా లాడుతున్నాయి.

3614 శ్రీకాకుళం

"టర్రు"మని ఎద్దుల్ని అదిలించుకొంటూ, దాని తొలిగించుకొని పెంచెలి దగ్గరికి వచ్చాడు సుబ్బడు. ఏదో సమాధిలో తదేకధ్యానంలో కదల కుండా మెదలకుండా నిలబడే ఉంది పెంచెలి.

"ఏమే" అని పలకరించాడు సుబ్బడు.

"అమ్మో! ఎంత వానో! ఎంత గాలో! ఇదేం ఖర్మమయ్యా, ఇంటికి పోనిచ్చేటట్టు లేదే, ఈ మాయదారి వాన!" అన్నది పెంచెలి.

"ఇంటికిపోవచ్చుగాని, రాయుడు చెప్పిపంపితే రానన్నావట! నీ కేమంత పొగరే!" అన్నాడు సుబ్బడు.

జల్లుమని కంపించింది పెంచెలిదేహం! అప్పటికి స్ఫురణకు వచ్చింది, తాను దూరిన కొఠం రాయుడిదని. కాని, రాయుడు అప్పుడు అక్కడనే ఉన్నాడని ఆమె కింకా తెలియదు.

"నిన్నే! అడుగుతూంటే పలకవేమే? నీ బతుక్కు అట్టాంటి మారాజు వెయ్యిజన్మా లెత్తినా చిక్కుతాడా? లచ్చనంగా ఇంత బంగారు పెడతాడు. డబ్బూ, దస్కమూ ఇస్తాడు! నీ కేమంత గాడా! అయన రమ్మంటే రానన్నావుట- ఎందుపల్లి?"

"ఊరుకోవయ్యా! సుబ్బయ్యా! ఇట్టాంటి ముచ్చట్లు నాకాడ ఎత్తకయ్యోవు, బాగుండదు!

"బాగుండక చేదా ఏందే! రాయుడు మోజుపడి, కులమయినా పాటించకుండా అడుగుతుంటే ఎన్నాళ్ళని ఇట్టా ఎగర్తించి పోగలవే! పిచ్చి పిచ్చి చేష్టాలు చేయవోక, నే తీసుకొనిపోతా రా!"

ఆకాశంలో మేఘాలు ఒరుసుకొన్నట్లే పెంచెలి గుండెలు రాపిళ్లు పడుతున్నాయి. పెంచెలి నోరు విప్పలేదు.

"రా. రాయుడు ఈడనే వుండాడు. రా! అయన్ని ఎగర్తించి పోబోక! చెడిపోగలవు" అన్నాడు సుబ్బడు.

ఆ సమయంలో రాయుడు ఆ కొఠంలోనే ఉన్నాడన్న సంగతి వినేవరకు పెంచెలికి దడపుట్టింది.

"అమ్మయ్యో! ఈడ కెందుకొస్తిరే! పెద్దపులినోట చిక్కితిరే దేవుడా" అని భయపడింది.

"ఇట్టా రా!" అని దాని చెయ్యి పట్టుకోబోయాడు సుబ్బడు.

గల్లుగల్లుమని దాని బిళ్ళోరి గాజులు పెద్దశబ్దం చేశాయి. అంబా అని ఒక ముసలిఎద్దు అరిచింది.

"సుబ్బా! లాక్కొనిరారా, దాని సొయ్యమణవాలి" అని ఆ చివరి నుండి గర్జిస్తూనే ఉంది రాయుడుసింహం.

"బాబో, వీళ్ల నన్ను బతకనివ్వ"రని అంటూ కింద పెట్టిన గడ్డిగంప చేతికి తీసుకొని వాకిట్లోకి దూకింది పెంచెలి.

"ఏడకి పోతావే!" అని మీదికి దూకి గంప పట్టుకొన్నాడు సుబ్బడు.

"పోనియ్యబోకురా" అని అరుస్తూనే ఉన్నాడు రాయుడు.

"నీ తల బద్దలకానూ, నీకేమింత పొయ్యేకాల మయ్యా! సుబ్బయ్యా!" అని పెద్ద అరుపు అరిచి సుబ్బడి చేతిలో గడ్డిగంప విడిచి పెట్టి చీకట్లోకి పారిపోయింది పెంచెలి. దాన్ని వెన్నంటి తరుమబోయిన సుబ్బడు కాలుజారి కింద పడిపోయి, లేచేలోపల పెంచెలిజాడ అయోమయమై పోయింది సుబ్బడికి.

"పోనిచ్చా వేమిరా పెద్దమ్మా?" అన్నాడు రాయుడు.

"దాని కిష్టం లేనిది మనం ఎంత చేస్తే మట్టుకు చిక్కుతుందా ఆడది?"

"ఏడవకపోయినావు! పెద్దమ్మా!- కామరా; చేతికి చిక్కిన ఆడదాన్ని పట్టుకొని రాలేకపోయినావే - ఏడవనా నువ్వొండీ!"

"నన్నేం చెయ్యమన్నావయ్యా; అది తప్పించుకొని పారిపోతేను!"

"అఘోరించావులే. ఇంతట పోగొట్టితే పోగొట్టావు కాని రేపు తెల్లవారి దాన్ని నువ్వు ఖండితంగా అడిగి తెలుసుకో."

"సరే: అట్టనే అడుగుతా లే."

"చూడు: పదిసవరలు బంగారు ఇస్తానని చెప్పు. మంచి పగడాల దండ ఇస్తానని చెప్పు. ఒప్పుకుంటుందిలే; ఇంకా పసిది కాబట్టి జంకుతున్నది.

"అట్లనే" అన్నాడు సుబ్బయ్య.

వాన రవ్వంత తెరపి ఇచ్చిన తర్వాత ఇద్దరూ ఇళ్ళకి పోయారు.

పెంచెలి ఎట్లా ఇంటికి ఘటం చేరవేసిందో - తన దేహం తనకి స్మృతి తెలియలేదు. పొద్దుపోయి, గాలివానలో పిల్ల ఇంకా ఇంటికి రాలేదని దిగులుపడి ఎదురుచూచే తల్లి దండ్రుల మనస్సుకి ఆమె ఆగమనం స్తిమితం చేకూర్చింది. కాని పెంచెలి మనస్సుకు స్తిమితం చేకూరేది ఎన్నటికి?

ఇంటికి పోంగనే తడిగుడ్డలు విడిచి, పొడిగుడ్డలు కట్టుకొని, తడిసిన తల తుడుచుకొని, తనకు ఆకలి లేదంటూ ఆ రాత్రి ఉపవాసంచేసి పండుకొంది పెంచెలి.

పెంచెలి కారాత్రి కంటికి నిద్ర రాలేదు. రాయుడు తన గుండెల్లో పెట్టిన అగ్నికణాన్ని రగుల్కొల్పి పెద్దది చేస్తున్నాడు. చిన్నతనం చపలత్వంచేత తనకు చెప్పి పంపించాడని ఆరంభంలో ఆమె లక్ష్యపెట్టకుండా తోసేసుకొంటూ వచ్చింది. కాని చూడగా అతడు పెద్ద ఆలోచన మీదనే ఉన్నట్టుగా ఉన్నాడు. వీలయితే తనను దౌర్జన్యం చేసైనా లోబరుచుకోవలెననే ప్రయత్నంమీద ఉన్నాడు. లక్షాధికారి' బలవంతుడు! ఆయన అంతరం ఎంత, తన అంతరం ఎంత? ఆ దొరకు తన మీద ఎందుకీ భ్రమ? ఆనాటి రాత్రి తనరోజు బాగుండి తప్పించుకొని పారిపోగలిగింది కాని, ఆ పెద్దపులిని తప్పించుకొని ఎన్నాళ్ళని తానా గడ్డమీద తిరగగలదు? ఈ సంగతి రొబ్బడితో చెప్పి, తొందరగా పెళ్ళిచేసి తీసుకొని పొమ్మంటేనో! అమ్మో, ఈ విషయం అతని చెవికిపోతే తనను గురించి అతడేమి సందేహిస్తాడో! అసలు తాను నోరు విడిచి ఇట్టా ఇట్టా జరిగిందని అతనితో చెప్పడం ఎట్లా?

పోనీ, తల్లితోగాని, తండ్రితోగాని తన బాధ చెప్పుకొంటే?- చెప్పి ఉపయోగం ఏముందీ, వాళ్ళిద్దరి మనస్సుకూ దిగులూ, విచారమూ

కొనితెచ్చిపెట్టడం తప్పా? వాళ్ళ బ్రతుక్కి- వాండ్లు పోయి రాయుడితో తగవులాడగలరా?—ఆమెకు గత్యంతరం తోచలేదు. తానీ విషయమై నోరు విప్పినట్టయితే నలుగురినోటా పెళ్ళికాని పిల్ల తనే రచ్చా రావిడీ అల్లరీ పడేటట్టుగా కనిపించింది కాని ఆ స్థితిలో సంభవించిన విపత్తు నెదుర్కొ-ని నిగ్రహించటానికి ఆమెకు గుండెనిబ్బరం చాలలేదు. కడుపులో పెద్ద భయమూ దుఃఖమూ పుట్టుకొని వచ్చినవి. తండ్రికీ తల్లికీ తెలియకుండా ఆ రాత్రి తెల్లవార్లూ ఏడుస్తూనే పండుకొన్నది పెంచెలి.

రాయుడికి మాత్రం ఆ రాత్రి కంటికి కునుకు ఎట్టా వస్తుందీ? రాత్రి భోజనం చేసుకొని, మిద్దెమీద రెండో అంతస్తుగదిలో పందిరిపట్టె మంచం మీద శయనించినప్పటికీ మాలవాడలో తాటాకుగుడిసెలో నులకకుక్కి-మీద పడి పొర్లుతూఉండే పెంచెలి స్థితికంటె హీనంగా ఉన్నది, అతగాడి స్థితి. కళ్ళెం తెగిన గుర్రంలాగ, విచ్చలవిడిగా సంచరిస్తోంది అతని మనస్సు. ఆరునెలలకిందట తన చేలో వరినాటుచేతలకి చూచినపుడు తన హృదయ ఫలకంమీద హత్తిపోయిన పెంచెలి ముఖబింబం అతన్ని పిశాచంలా పట్టుకొని పీక్కొ-ని తింటోంది. మనోగతమైన ఆ బింబాన్ని సాకారంగా హస్తగతం చేసితీరుతానని అతని ధనలక్ష్మి అతడాశ వదలుకొన్న కొద్దీ అభయహస్త మిస్తూనే వుంది అతనికి. తాను కామించింది ఆ స్త్రీ అవయవ సౌభాగ్యసంపత్తికాని, ఆ మాలదాని కులం కాదుగా! తనవల్ల నిత్యమూ ఎన్నో సహాయాలు పొందే ఒక బీద మాలకుటుంబంలో పుట్టిన పిల్ల తన యెడల అంతమాత్రం కృతజ్ఞత చూపలేదూ!

పెంచెల్ని సాధించడం ఎట్లా???

తల వ లిపోతోంది రాయుడికి.

ఆ రాత్రి మాలవాడలోని పెంచెలికీ, మేడమీది రాయుడికీ కాళరాత్రే! గుర్రపు సాలలో చింకిరిచాపమీద శయనించిన రొబ్బడు మాత్రం ఒళ్లెరగడు.

3

కాలవైపరీత్యం—బళ్లు ఓడలా ఓడలు బళ్లూ అవుతూ ఉంటవి! రాయుడి తాత ఉప్పుకావిళ్లు మోసుకొని జీవించేవాడట! అయితేనేం? అది ఎప్పటి సంగతో — పురాతన కాలంనాటి సంగతి. రాయుడి కుటుంబానికి. ఆతని తండ్రి హయాంలోనే అందుకొన్నది శుక్రమహాదశ! ఆరంభంలో అతగాడు అయిదువందల రూపాయలు అప్పుచేసి, పూనా, బొంబాయి ప్రాంతాల్లో ఆరంభించిన ముత్యం, పగడాల వ్యాపారం, పాటిగడ్డమీది తోటకూర కాడలాగ రెపరెపలాడుతూ ఎక్కివచ్చి, ప్రాణం హరీ అనేవరకు అతడు లక్షరూపాయల ఆస్తిని గడించి, కొడుకు రాయుడి చేతిలో పెట్టి మరీ చచ్చిపోయాడు. ఇంతకీ అదృష్టమంటే రాయుడిదిగాని, నిజంలో అతని తండ్రిది కానేకాదు. తండ్రి సంపాదించి యిచ్చిపోయిన నూరు ఎకరాలమీదా ఏటా పండే నూరుపుట్ల ధాన్యమూ, ఇంటిచుట్టూ కూట్లు కట్టించి నిలవచేసుకొని, కోస్తాలో ధాన్యానికి ధర ఎప్పుడు ఉబుకుతుందా అని తపస్సు చేయవలసిన బదనాయంతప్ప, ఇక ఇతరవిధమైన బాధ్యతగాని, చీకుగాని. చింతగాని, ఎరగడు ఆ మానవుడు! పుట్టుభోగి; ముప్పయ్యేళ్ళు నిండని నిండు జవ్వనం! ఏడుకావిళ్ల రూపాయల సంచులతో కాపరానికి వచ్చిన భార్య — పెంచెలి కంటెకూడా తనకి పచ్చిపచ్చిగా, వగరువగరుగా ఉంది ఇంకా! అందీ అందనట్లు ఉవ్విళ్ళూరించే దోరకాయ—ఆ పెంచెలి తన మనస్సులో విషం కలిపి, ఊఁ, కలచివేస్తోంది.

పెంచెలి తన చెయ్యి జారిపోయిన రాత్రికి అనంతరం వారంరోజుల కొకనాడు సాయంత్రం రాయుడు మిద్దెమీద వసారాలో గచ్చు అరుగుమీద రెడ్డికంపేసుకొని చుట్ట కాల్చుకొంటూ పండుకొన్నాడు. ఆనాటి రాత్రి పశువుల కొఠంలో వ్యవహారం అంతా చెడగొట్టిన చపటపెద్దమ్మ, ముతరాచు సుబ్బడు మిద్దెక్కి,

"దాని కప్పుడే పెళ్ళిమనువుకూడా ఖాయం అయిందట" అని అన్నాడు.

రాయుడు ఉలిక్కిపడ్డాడు.

"దేనికిరా?"

"పెంచెలికే!"

"ఏ వూళ్ళో?"

"వాడి స్వంతవూరు పడమట-బద్వేలి! మా ఆడదాని వూరే వాడిది కూడా. నేను వాణ్ణి బాగా ఎరుగుదును. నేను నగరం సంతకి పోయినపుడల్లా వాడు నా కగపడుతూనే వుంటాడు తమరెన్నడూ వాణ్ణి చూడలేదూ?"

"ఎవడురా వాడూ?"

"అదేందిసామీ! పోలీసుసూపరెంటు గుర్రంకాడ ఉంటున్నాడు, నల్లంగా పొడుగ్గా—భారీమనిషి! తమరు కూడా చూసే వుంటారు, గుర్తు లేదేమో?"

"సూపరెంటు గుర్రంకాడ ఉంటాడా? వాడి పేరు?"

"రొబ్బడు. నెలకి పదిహేనో ఇరవయ్యోకాబోలు వాడికి జీతం! ఇప్పటి కప్పుడే ఏడెనిమిది నెల్లనుంచీ, వాళ్ళిద్దరూ పెళ్ళి చేసుకోవాలని తీర్మానం చేసుకొన్నారంట! వా డెన్నడూ నాతో అననే లేదీ సంగతి; నిన్న తెలిసింది నాకు మాలవాడలో!"

"అట్లానా ?"

"ఈ పిల్ల దినమ్మా గడ్డిఎత్తుకొని వాడిదగ్గిరికి పోయి వస్తూనే ఉంటదట! వాడేమో సూపరెంటు ఆసరా చూసుకొని, పెళ్లికి గుర్రమెక్కి ఊళ్ళో ఊరేగాలని కూడా పట్టుపట్టాడనీ, అందుకు మాలవాళ్లు కూడా సరేనన్నారనీ మాలవాడంతా గోలగోలగా ఉండది."

"మనవూళ్ళో మాలవాళ్లు గుర్రమెక్కి ఉత్సవం చేసుకొనే ఆచారం లేదు కాబోలు కదరా?"

"లేదు-సరే. వాడికి తేరగా గుర్రం చేతిలో ఉండే. పైగా పోలీసు సూపరెంటు ఆసరా ఒకటి ఉండె. పెద్దమాలవాడు అంకడూ, పెంచెలి అబ్బ వెంకటిగాడూ పెద్దతలకాయలు, గుర్రమెక్కి ఊళ్ళోకి వస్తే, తమబోటి

గొప్పోళ్ళంతా ఏం చేస్తారో అని అజ్జాయిస్తూ ఉన్నారంట! కాని- ఇప్పుడిప్పుడు బయల్దేరుతూ ఉండారే, ముందరిజుట్లు పెట్టుకొనే కుర్రకారు- వాళ్ళు మాత్రం సంబరం చేసుకోవలసిందే అని హఠంపట్టి ఉండారంట."

"అబ్బో! శానాకథ పెరిగిందే!...."

"పాపం! మన సేద్యగాడు రోశిగాడు, ఒకటే గోల, ఈ పెళ్ళి ఖాయమైనప్పటినుంచీని...."

"ఎందుకూ!"

"వాడు తల్లీతండ్రీ లేని దిక్కులేని పచ్చి! నీకు పిల్లనిచ్చి పెళ్ళిచేస్తాననీ, "ఇల్లరికం పెట్టుకొంటా" ననీ చిన్నప్పటి నుంచీ వాడి మేనమామ వెంకటిగాడు ఆశపెట్టి, వాడికి తమరు ఏటా యిచ్చే జీతంవడ్లు పుట్టీ ఏదుంగిజలా వెంకటిగాడే కాజేస్తూ, తీరా ఇప్పుడు ఆ పిల్లకి పెళ్ళీడు వచ్చే వరకు దాన్ని పరాయిచోట యిచ్చి చేస్తున్నాడని రోశిగాడు ఒకటే గోల.... పాపం!"

"అయితే మన రోశిగాడికి, వెంకటిగాడు సయానా మేనమామా!"

"ఓ వేలువిడిచిన మేనమామ కాబోలు! అయితే మట్టుకు, ఇన్నేళ్ళగా ఆశపెట్టి, వాడిచేత అన్నిపనులూ చేయించుకొని, చూడండి, ఇప్పు డెట్లా ఎదురుతిరిగారో వాళ్లందరూ కూడా "

"అసలు పిల్ల ఏమంటుందీ?"

"అదో మిడిమేలపు పిల్ల! దానికి ఆ పడమటాడి మీదనే మరులు· ఆ గుర్రం, ఆ సంబరం, ఆ ఊరేగడం....ఆ దరువు మీదనే ఉండాదది· ఇట్టాంటి చవటల్ని దగ్గరకి రానిస్తుందా మొదలు?"

"అట్లానా?...."

"ఆ రోశిగాడు - ఒకటే గోల! అందులో ఆ పిల్ల ఎర్రగా కాస్త కంటికి నదరుగా అగపడే చట్టమైన పిల్లేమో- దాన్ని విడిచిపెట్టుకోవాలంటే, వాడు దిగులుపడి చస్తుండాడు."

"ఆ వెధవ సంగతికేంగాని, నువ్వు మళ్లా దాన్ని అడగలేదటరా?"

"అడగకేం! ఈ వారంరోజులుగా అడిగి, అడిగి, ప్రాణం చాలొచ్చింది నాకు. మనం ఒక్కమాట మాట్లాడితే, అది పది మాటలు చెపుతుంది. అది మనకి అలివి అయ్యే మనిషి కాదు—"

"............ .."

"మా దొర నిన్నేం చేయడులేవే! ఒక్కపాలి ఆయన కాడికి వచ్చి, ఒక్కమాట మాటాడిపోదువుగాని రమ్మంటే, రాను పొమ్మని దాని దొకటే పాట! ఇక దాన్నడగడమే నాకు చిన్నతనంగా ఉంటాది సామీ!"

"సరే!" ఇక నువ్వు దానితో ఈ ప్రస్తావన ఏమీ చేయనేవద్దు, పలక్కుండా ఊరుకో!........"

"చిత్తం! ....కాని దొరలు ఎట్లనయినా, ఈ పెళ్ళి నిలుపుదల అయ్యేటట్టు చేయిస్తిరా, దాని రోగం కుదురుతుంది: అటు తర్వాత మన చెప్పుకింద తేలయి పడిఉంటది-" అంటూ మిద్దె దిగి వెళ్ళిపోయాడు సుబ్బడు.

రాయుడికి మనస్సు స్తిమితం చెడింది: పరిపరివిధాల పోతోంది అతని మనస్సు. అతని నోటిలోని చుట్టచివరి ఎర్రదాలు ప్రస్ఫుటంగా గోచరిస్తోం . పెంచెలి చెయ్యి జారిపోతోందని అతనికి ఒక విధమైన ఖంగారు పుట్టింది. పోనేపోయింది తన యెడల అది చూపిన అవిధేయతకు తగిన శాస్తి చేసి విడిచిపెట్టితేగాని వీల్లేదని అతనికి క్రోధం ఉద్రేకించింది. తన గ్రామం అంత నిర్భయంగా ప్రవేశించి, తాను కాంక్షించిన వస్తువును తీసుకొని పోదలచిన ఆ మొనగాడెవరా అని అతనికి ఆలోచన కలిగింది! అతనికి చికాకనిపించి పండుకొన్న మనిషి లేచి వసారాలో ఇటూ అటూ పచారు లారంభించాడు.

రాయుడిది పిన్నవయస్సయినా, పట్టుదలమనిషీ, హఠవాదీని. తనను ఎదిరించిన మనిషిని సాధించి, రాచి రంపాన పెట్టేవరకూ అతగాడికి ఆ గ్రామంలో ఎదురులేదు. తనంతటి మనిషికి ఒక మాలదానివల్ల పరాభవం కలిగిందే అని అతనికి అరికాలిమంట నెత్తికెక్కింది. "ఛా! నోరువిడిచి ఎందుకు అడిగాను దాన్ని" అని జుగుప్సపడతాడు........కానీ........చూతాం ....అనుకొన్నాడు. ఈ విషయం మళ్ళా రెండో చెవికి రానేకూడ

దనుకొన్నాడు. ఆ రాత్రి తెల్లవార్లూ, తన బుద్ధికి పదునుపెట్టి ఆలోచన సాగించాడు. మెదడ వేడెక్కుతోంది. కాని, పద్మవ్యూహానికి పథకం కుదరడం లేదు.

తెల్లవారుజామున కోడికూతవేళకు అతని కొకపథకం కుదిరింది. అప్పటి పరిస్థితుల్లో పని చేయదగ్గది అదొక్కటే ముందు, ఆ గరళం పనిచేస్తే చేసినట్టూ, లేకుంటే లేనట్టూను అనుకొన్నాడు.

ఉదయం నిద్రలేచీ లేవడంతోనే ముతరాచు సుబ్బడికి కబురుచేశాడు. వాడితో ఏదేదో మాటాడి, చివరకు ఈ విషయంలో తనపేరు బయటికి వస్తే గొంతుకు పిసుకుతానని చెప్పి వాణ్ణి పంపివేశాడు.

"చిత్తం. ఆ పని అంతా నేను చక్కబెట్టుకొని వస్తానుగా-తమరికా సందేహం ఏమీ పనిలేదు." అంటూ వెళ్ళిపోయాడు సుబ్బడు.

తెల్లవారి, ఉదయం నాలుగు ఘడియల పొద్దెక్కిన తర్వాత గ్రామంలో ఇతర పెద్దతలకాయలను—చలమానాయుణ్ణీ, సభాపతినీ, శింగర శెట్టినీ పిలిపించాడు రాముడు; వాండ్లతో రహస్యంగా మంతనాలుచేసి గ్రామంలో మాలవాళ్లు కొత్తగా గుర్రాలెక్కి ఉత్సవం చేసుకొంటూ ఉంటే పెద్దతలకాయలు నలుగురూ ఊరుకొంటారా, మీకు పౌరుషం లేదా, ఛీకు పరువులేదా అని వాండ్లను చివాట్లు పెట్టి శివమెత్తించాడు. మాలవాళ్లు గనుక గుర్రం ఎక్కి వీథిలోకి వచ్చినట్టయితే, గ్రామంలోని రైతు లందరూ చేరి, తలకాయలు పగలగొట్టడానికి తయారుగా ఉన్నారు కాబట్టి జాగ్రత్త అని మాలవాండ్లకు తెలిసేలాగున ఊళ్ళో పుకారు లేవదీశాడు—తాను తెరచాటునే నిలబడ్డాడు.

4

పెంచెలి ఏ ముహూర్తాన తన వివాహ విషయమై తలపెట్టిందో కాని ఆక్షణం లగాయతు ఆమె కన్నీ కడగళ్లుగానే కన్పట్టుతున్నవి. ఆమె మనస్సు శాంతీ, సంతోషమూ ఎట్లాంటివో ఎరగదు. గ్రామమూ,

మాలవాడాకూడా అట్టుడికినట్లు ఉడికిపోతున్నది. మాలవాడు గుర్రమెక్కి ఊళ్ళో అడుగు పెట్టినట్టయితే ముక్కలు ముక్కలుగా చెండాడుతామని ఊళ్లో రైతులూ, ఏమైనప్పటికీ ఈ పెళ్లికి మాత్రం వెనక్కి జంకకూడదని మాల వాళ్ళూ - అప్పుడే రోషాలెక్కి వీరావేశం మీద కత్తులూ, కటార్లూ నూరు తున్నారు మాలవాడలో పెద్ద తలకాయలు పదిమందీ కలిసి, ఇంతదూరం వ్యవహారం రాకుండానే, నెమ్మదిమీదనే చక్కపెట్టుకొందామని యోచనతో గ్రామంలో ఉత్సవం చేసుకోవడానికి ఉత్తర్వు ఇవ్వవలసిందని గ్రామపెద్దల నందరినీ ఆశ్రయించి అర్థించారు. కాని ఉపయోగం కనిపించలేదు; రాయుడి దగ్గరికి పోయి ఆయనగారి రెండుకాళ్ళూ పట్టుకొన్నారు. 'గ్రామంలో ఇతర పెద్దలందరూ ఇష్టపడితే తన ఆక్షేపణ ఏమీ లే'దని మాలలతో బహిరంగంగా తియ్యని మాటలు చెప్పుతూ - గ్రామంలో మాలవాళ్లు కొత్తగా కోరే హక్కును వాళ్ళకు ప్రసాదించినందుకు మాలలందరూ కలిసి, ఆ గ్రామ ఉమ్మడి ఖర్చులకుగాను పోగుచేసిన ఫండుకు రు. 300 లు నజరానా చెల్లించి నట్టయితే ఈ హక్కు శాశ్వతంగా మాలవాళ్ళకి విక్రయం చేయడానికి గ్రామస్థులు సిద్ధంగా ఉన్నారని లోపాయికారీగా రాయుడు మాలలకి కబురు చేయించాడు. కాని వాళ దగ్గర అంత శక్తి ఏదీ? మాలవాడలో ఎందరి సంసారాల్లోని కుండబొచ్చెలు పోగుచేస్తే మూడువందల చిన్నడబ్బులు కాగలవు? ఎన్ని సంసారాలు దిబ్బరేస్తే మూడువందల అణాలు కాగలవు? బాబో! మావల్ల కాదంటే మావల్ల కాదని గుండెలు కొట్టుకొన్నారు మాలలు. అంతగా వ్యవహారం వల్లతప్పి, మెలిబడితే కొండంత ఆసరా సూపరెంటు దొర ఉండనే ఉంటాడని వాళ్ళు ధైర్యం తెచ్చుకొని కూర్చున్నారు. అయితే అయిందీ, ఎంతకయినా తెగబడుదామని మాలవాండ్లు నడుముకు ధట్టీలు బిగిస్తున్నారు.

మాలవాడలో జరిగే ఈ గలభాకి పెంచెలి తాళలేక పోయింది. తన మూలాన్ని కొంపలూ కొంపలూ అంటుకొని పోయేటట్లుగా ఆమెకు తోచింది.

"దానింట వానగురిసిన గుర్రం! సంబరం లేకుంటే మానె! అయినా నేనూ ఇంత పప్పూకూడూ తిని, కంకణాలు కట్టుకొని పెళ్లి అయిందనిపించు కొంటే శాన! ఆ రాయడు నన్నెట్టాగూ బతకనిచ్చేటట్టు లేదు. ఈ రచ్చ

అంతా ఆయనగారు లేవదీసిందే! అవులా అవులా కుమ్ముకొని లేగల్ని తన్నినట్లు, ఈ కొట్లాటలో నా పెనిమిటి కేం కీడు చేస్తారో, ఆయనా తల్లీ తండ్రీ లేని దిక్కులేని పచ్చి! నా మీదనే కళ్ళు పెట్టుకొని బతుకుతుండాడు! మా ఇద్దరి ప్రాణం సల్లగుంటే ఇంత బొద్దాకూ నీళ్ళూ తాగి బతుకుతాం! ఏమైనాసరే, ఈ సంబరం ముగించుకోమని ఆయన కాళ్ళు పట్టుకొంటాను. ఒప్పుకొంటాడు లే, నే చెప్పితే వింటాడులే మామ!" అని మధ్యాహ్నం పన్నెండు గంటలకు, ఎఱ్ఱటి ఎండ అని అయినా అనుకోకుండా, బయలు దేరింది రొబ్బడి దగ్గరికి పెంచెలి.

నడినెత్తికి వచ్చి తేరి చూడడానికి వీల్లేకుండా నిప్పులు కక్కుతున్నాడు ప్రచండభాస్కరుడు. ఎండ తగలకుండా నెత్తిమీద కొంగు ముసుగు కప్పింది పెంచెలి; గుఱ్ఱాన్ని గనక ఊళ్ళోకి తీసుకొనిరాకుంటే ఇక తన పెళ్ళి కేమీ కష్టాలు లేవని స్తిమితపడింది: గుఱ్ఱాన్ని తీసుకొని రాకుండా పెళ్ళికొడుకు రొబ్బణ్ణే ఒప్పించినట్లయితే తనకే బాధా ఉండదని ఆశించింది. వీధివాకిలి లోపలి నెట్టి గుఱ్ఱపుసాలలోకి పోయింది పెంచెలి.

మంచి నడిజాము పొద్దు. ప్రజలు భోజనాలు చేసే సమయం, భోజనానంతరం విశ్రాంతి తీసుకొనే సమయమూను. రొబ్బడు అపూట అన్నం తిన్నాడో లేదో, గుఱ్ఱపుసాలలో చాపమీద ముసుగుతన్ని పండుకొని గాఢనిద్రలో ఉన్నాడు. గుఱ్ఱం కూడా వాడి వైపు చూస్తూ ఏదో విచారాన్ని సూచిస్తూ ము చుకొనిపోయి నిలబడి ఉన్నది. అంత గాఢ నిద్రావస్థలో ఉండిన తన ప్రియుణ్ణి లేవగొట్టనా వద్దా అని సందేహించింది పెంచెలి; కాని ఆమె తన మనస్సులోని ఆత్రం అరికట్టలేకపోయింది. ఎఱ్ఱటి ఎండలో పేరెంమీద వచ్చిన వగర్పుతోనే—

"మామా! మామా!" అని అతని పక్కనే కూర్చొని తలమీద ముసుగుతీసి రొబ్బణ్ణి నిద్ర లేపింది. ఉలిక్కిపడి నిద్రలేచాడు రొబ్బడు. ఎఱ్ఱటి చింతనిప్పుకణాల లాగ ముఖంలోకి ఉబికి నెత్తురు కక్కుతున్నాయి అతగాడి నేత్రాలు. పెంచెలికే ఆ ముఖవీక్షణం భయంకరమయింది. నిద్రలో లేచినందువల్ల ఆవిధంగా ఉన్నా డనుకొన్నది పెంచెలి.

"మామా! మామా! మన కాగుర్రమూవద్దు, ఆ సంబరమూ వద్దు మామా!"

"నా కా గుర్రమూవద్దు, ఆ సంబరమూ వద్దు, ఆపెళ్ళీ వద్దు" అన్నాడు రొబ్బడు.

ఉలిక్కిపడింది పెంచెలి.

"మామా! నిద్రకళ్ల నేందీ ఆ మాటలు! శుభమల్లే పెళ్లెందుకు వద్దు?"

"సంబర మెందకు వద్దు?"

"మాలాడు గుర్ర మెక్కి వూళ్ళో సంబరం చేసుకొంటే, తలకాయ పగులకొట్టుతామని ఊళ్ళో పెద్ద ఆసాము లందరూ కత్తికట్టి ఉండారు."

"మిండగాళ్ళని మరిగిన లంజ, నన్ను మోసంమీద పెళ్ళిచేసుకోవాలని వస్తే తలకాయ పగలగొట్టాలని కర్ర చేతపట్టి ఉండాడు ఈ రొబ్బడు."

"ఏంది మామా! ఈ మాటలా?"

"ఏందే లంజా! ఈ తప్పుడు చేష్టలు?" అని లేచి పెంచెలి కుడిప్రక్కన ఒక్క తన్ను తన్నాడు రొబ్బడు. పెంచెలి కేమీ అర్థంకాలేదు. దీనై ఖిం నిర్ఘాంతపోతోంది; అతన్ని అడుగుదామని అనుకొంటుంది- కాని నోరు విడిబడడం లేదు. ఇంతలోనే రొబ్బడు దాని జుట్టు పట్టుకొని "ఊళ్ళో వాళ్ళందరినీ మరిగి నన్ను... పెళ్ళాడాలని తయారవుతావా?" అని దాని తల కిందికి వంచి, వీపుమీద పిడిగుద్దులు కురిపించాడు.

'బాబోయి, బాబోయి' అని అరవడానికి కూడా నోరురాలేదా పడుచుకి! అతని పై ఖి కాళ్ళర్యపోవడంతప్ప దుఃఖించడం చేతకాలేదా అబలకి. ముఖంమీద విడిబడ్డ కురులు సవరించుకోనే లోపలనే ఎప్పుడు తెచ్చాడో పదినారల జనపనారపగ్గం ఒకటి తెచ్చి పెంచెలి రెండు చేతులూ వెనక్కి విరిచికట్టి ఆమెను బరబర లాక్కొనిపోయి గుంజకు కట్టివేశాడు రొబ్బడు. నోరు విప్పలేదు ఆ భూదేవి! కళ్లు చారెడు చేసుకొని అతని ముఖంలోకి చూస్తూ నిలబడి ది కొయ్యలాగ!

గుర్రాన్నితోలే కంచీ చేత తీసుకొని ఎదురుగా నిలబడ్డాడు ఆమె ప్రేమ చూరగొన్న ప్రియుడు.

"నిజం చెప్పుతావా చెప్పవా?"

ఆమె పెదిమెలు కంపించాయి.

"నువ్వు నీ మేనత్తకొడుకు రోశిగాణ్ణి పెట్టుకొన్నావా లేదా?"

"రామ! రామ!" అంది ఆమె హీనస్వరంతో.

"ఏడే నీ రాయుడు?" అని అతడు ఉచ్చరించే లోపలనే ఆమె దేహంమీద కంచీ ఛెళ్ళుమని పలికింది.

"మామా!........" అని మాత్రమే అనగలిగింది ఆ శీలవతి.

'ఆనాడు నువ్వు నాకాడనుంచి పోయినపొద్దు మీవూరు కాపు రాయుడి పసువులకొఠంలో దూరావా?"

"దూరాను" అని సత్యవాణి పలికింది.

"ఎందుకు దూరావు?"

"వానజల్లుకి భయపడి."

"రంకుతనం అంటే భయంలేనిదానికి నీకు వానజల్లంటే భయమా?" అని తీవ్రంగా హెచ్చరించింది కంచీ!

"మామా...."

"ఆ పాకలో ఏమి జరిగిందో నిజం చెప్పు"

పెంచెలి ముఖంలో మిడిగ్రుడ్లే అతనికి జవాబిచ్చాయి.

"పలకవేం?"—అని కంచీ ఆడించాడు రొబ్బడు.

ఆ కంచీ చేసే ధ్వనికి, దాని రుచితెలిసిన ఆ గుర్రం భయపడి, బెదిరి కలగదొక్కుకొంటోంది.

పెంచెలి గొంతెండిపోయింది; గుటక పడడంలేదు. కళ్ల చీకట్లు కమ్ముతున్నాయి; కాని రెప్పలాడడంలేదు. నిజం చెప్పుతావా చెప్పవా అని రొబ్బడి చేతిలోని కంచీ యింకా సత్యాన్వేషణకొరకు పెంచెలి రక్తాన్నికూడా పరిశీలిస్తోంది.

"మామా—" అని నోరార పిలవాలని ఆమె కోరిక. తన ప్రియుని కరువుతీరా కౌగిలించుకోవాలని ఆమె ఉబలాటం! తనమీద ఎంత ప్రేమా, ఎంత విశ్వాసమూ లేనిదీ ఆ అమాయకుడికి, లోకం చెప్పిన చెప్పుడు మాటలమీద అంత ఆగ్రహం వస్తుందా అని ఆమె భావన. ప్రేమ సూచకములా - ఆ కంచీ దెబ్బలకు ఆమె శరీరం ఉప్పొంగిపోతోంది—కాని ఆ అపూర్వమైన అనుభవంతో ఆమె బదులు చెప్పలేక నిశ్చేష్టమై తన్ను కట్టివేసిన కొయ్యగుంజలాగే కొయ్యలా నిలబడి ఉన్నది పెంచెలి.

మౌనం అర్ధాంగీకార సూచకమా? తన ప్రశ్నకు జవాబు చెప్పకుండా, చేసిన తప్పు ఒప్పుకొంటోంది! అనుకొన్నాడు రొబ్బడు. వాడి కసి తీరడం లేదు. తానింకా పెండ్లాడని పిల్లే, ఆ పిల్లమీద తా నంత తీవ్రమైన అధికారం చెలాయించవచ్చునా అనే యోచన మనస్సుకు తట్టలేదు ఆ పెళ్ళికొడుక్కి, ఒక సంవత్సరంగా తనతో కపటస్నేహం చేసి మోసగించిందని అతనికి శరీరం భగ్గున మంటలెత్తి పోతోంది! అందులో పోలీసు సూపరెంటు దొర దగ్గర నౌకరీ చేస్తుండే మనిషి తాను. అతనికి వీరావేశం విజృంభించడానికి ఇంకా ధూపం ఎందుకూ?

పెంచెలికి కట్టిన కట్లు విప్పాడు! ఆమె దేహం అప్రయత్నంగా అతని పాదాలమీద పడిపోయింది—కాని, ఆ క్రోధమూర్తికి జాలి ఏదీ?

"చావు లంజా!" అని తన శక్తికొద్దీ దాని వీపు మీద ఒక్క పిడిగ్రుద్దు గుద్దాడు రొబ్బడు. తన కనుగ్రుడ్లులోని ఎరుపురంగుతో దీటయిన రక్తం ఆమెనోట బళ్ళున ఒక గ్రుక్కెడు కక్కుకొనేటప్పటికి అతనికి ఈ ప్రపంచం తెలిసింది.

"ఓసీ! ఇంత మోసమా! చెప్పుకో, నీ దిక్కున్న చోట చెప్పుకో! నా కాపెళ్లీ వద్దు, ఆ గుర్రమూ వద్దు, ఆ సంబరమూ వద్దు. ఈ సూపరెంటు దగ్గర నాకీ నౌకరీకూడా పనిలేదు. ఇప్పుడే లేచిపోరాను మా వూరికి" అని పైమీద గుడ్డవేసుకొని నోటివెంట నురుగులు కక్కుకొంటూ ఆ క్షణమే లేచి చక్కాపోయాడు రొబ్బడు.

సాయంత్రం అయిదుగంట లయింది. అప్పటికి చల్లబడింది ప్రచండ సూర్యబింబం పెంచెలికి స్పృహ కలిగింది. లేచి కూర్చుంది. నలువైపులా చూచుకొంది! తాను ఏకాకిగా ఉన్న దా ఆవరణలో, ఒడలూ, గుడ్డలూ చూచుకొంది. నెత్తురుమరకలు ఆమె గుండె చెదరగొట్టాయి. ఆమె లేచి నిలబడింది. రెండుచేతులూ ఎత్తి గుర్రానికి దణ్ణం పెట్టింది. పెద్దనవ్వు నవ్వింది మామా....మామా....అని పిలిచింది. పెద్ద ఏడుపు ఏడిచింది. సూర్యాస్తమయం కాబోతోంది. పెంచెలి వీధిలోకి పోయింది.

విరబోసుకొన్న జుట్టు, చిరిగిపోయిన రవిక, గాట్లుపడ్డ దేహం! బూడిదలో పొర్లాడిన నెత్తురుమరకల చీర! వికృతాకారం! వికటాట్టహాసం! వెర్రిచూపులు! కారణంలేని ఏడుపు - అహా! ఇక మూడురోజులకు మెడలో మంగళసూత్రధారణ చేయించుకోవలసిన పెండ్లికూతురా ఆ అవతారం!

వీధిలో తిరిగే కుక్కలు మొర్రో అని ఆమెవెంట బడ్డాయి. తనని కరవమని వాటినోటికి తనచేతు లందిస్తుంది- పెంచెలి. వీధుల్లో ఆడుకొనే పిల్లలు చిన్న చిన్న రాళ్ళు తీసి ఆమెమీద రువ్వుతూ దూరంగా పోయి కేకలు పెట్టుతున్నారు. తన తల పగలగొట్టుమని పెద్ద పెద్ద బండలు తీసి ఆ పిల్లల కివ్వబోతుంది; వచ్చే పోయే మోటారు కార్ల కిందా, బండ్లక్రిందా పడిపోవాలని రోడ్డులో వంకర వంకరగా నడుస్తుంది. కాని అవి అన్నీ ఆమెను తప్పించుకొని పోతున్నాయి.

సంజచీకట్లు విరిశాయి. పెంచెలి వికృతాకారం మరీ భయంకరమయింది. ఆమె ఇంకా పోతూనే ఉంది. తన వూరికి పొయ్యే దారిలో రాయుడి పశువులకొఠం దగ్గరికి వచ్చింది. పెద్దనవ్వు నవ్వింది. పిచ్చిపాట పాడింది. ఆ కొఠం చుట్టూ తిరిగింది. కానుగచెట్టు కిందికి పోయింది. మామా అని దాన్ని గట్టిగా కౌగిలించుకొంది. కళ్ళు మూసుకొంది. పెద్దంగా ఏడిచింది. 'మామా, రా' అంటుంది. 'నేనూ వస్తా' అంటుంది ఇటూ అటూ పరువులెత్తింది. ఇటూ అటూ రెండు మాలగద్దలు పశువులకొఠంమీద వాలాయి. వాటిని చూసింది. పెద్ద వెకిలినవ్వు నవ్వింది: 'మామా' అంటూ క్రింద తూలి పడిపోయింది.